

మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ ఎంపీ విశ్వేశ్వరరెడ్డి

బీజేపీ పార్టీ గెలుపునకు కృషిచేయాలి

గచ్చిబౌలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ముఖ్యనేతలతో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఎం.రవికుమార్‌యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు అతి దగ్గరలోనే ఉన్నాయని, పార్టీ తరుపున తాను చేవెళ్ల బరిలో ఉంటానని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పార్టీ గెలుపునకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్‌రావు, కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగులుగౌడ్, నవతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ డీటీఓగా రఘునందన్‌గౌడ్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న డీటీఓ

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి రఘునందన్‌గౌడ్ పేట్‌బషీరాబాద్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టే ముందు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్‌ను కలిసి మొక్కను అందజేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన డీఈఓ కిషన్ మెహిదీపట్నం కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అదే విధంగా మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న శిల్ప, ఆర్.బాబులు, అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత బాధ్యతలు చేపట్టారు.

నల్లపోచమ్మ ఆలయ కమాన్‌కు శంకుస్థాపన

నిజాంపేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ నల్లపోచమ్మ దేవాలయం ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన ఆలయ ముఖద్వారం (కమాన్) నిర్మాణానికి ఆలయ చైర్మన్ కొలన్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, ఆలయ పూజారి శ్రీకాంత్‌చారి, నర్మద, అర్జున్, లక్ష్మణ్, వెంకటేశ్వరరావు, స్థానికులు, ఆలయ కమిటీసభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ జాతరలో భవిష్యవాణి, పూజలు

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గాజులరామారం శ్రీరేణుకా ఎల్లమ్మ జాతరలో సోమవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి విశేష పూజలు, మధ్యాహ్నం 3గంటలకు గావు రంగం, పోతురాజుల నృత్యాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగం కార్యక్రమంలో అమ్మవారు ఆవహించిన వ్యక్తి నా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటానని. మొక్కులు చెల్లించుకొనే భక్తుల మొక్కులు తీరుస్తానని, ఈ సంవత్సరం అంతా వర్షాలు విస్తారంగా కురుస్తాయని, పంటలు బాగా పండి అన్నివర్గాల ప్రజలు ఆనందంతో ఉంటారన్నారు. మంగళవారం భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ ముత్యంపాగ సహదేవ్, కార్యదర్శి పెరుమళ్ళ రవి, కమిటీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్ ఈఈగా కేవీఎస్ రాజు

చందానగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(ఈఈ)గా కేవీఎస్ రాజు నియామకమయ్యారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని అల్వాల్ సర్కిల్‌లో ఈఈగా పనిచేస్తున్న రాజు బదిలీపై చందానగర్ సర్కిల్‌కు వచ్చారు. ఇక్కడ ఈఈ గా పనిచేస్తున్న శ్రీకాంత్‌ని అల్వాల్ సర్కిల్ ఈఈగా బదిలీ చేశారు.



స్వామివారి పల్లకి ఊరేగింపులో భక్తులు

ఘనంగా రంగనాథస్వామి ఆలయ బ్రహోత్సవాలు

రాయదుర్గం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నానక్‌రాంగూడ రంగ్‌బాగ్‌లోని రంగనాథస్వామి ఆలయ బ్రహోత్మవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, అభిషేకం, సాయంత్రం పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



క్రీడాకారులతో బండి రమేష్, అసోసియేషన్ సభ్యులు

విజేతగా సౌత్ సెంట్రల్ రైల్వే టీం

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ స్పోర్ట్స్ క్లబ్ పేరుతో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా సౌత్‌సెంట్రల్ రైల్వే టీం నిలిచింది. 14 టీమ్‌లు పాల్గొనగా రెండు ఏకశిల వరంగల్, మూడు కేపీహెచ్‌బీ, నాలుగో స్థానంలో వరంగల్ అసోసియేషన్ టీమ్‌లున్నాయి. క్రీడాకారులను కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి బండిరమేష్, మాజీ కార్పొరేటర్ కావ్యారెడ్డి అభినందించారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జేఎస్.నారాయణరావు, మోర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో క్యాష్‌ప్రైజ్‌లు, మెమోంటోలను విజేతలకు ప్రదానం చేశారు.



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

టైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

నిజాంపేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ టైక్వాండో యూనియన్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిర్వహించిన పోటీల్లో కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్ పర్వతాపూర్ విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించారు. విద్యార్థులకు మంచి శిక్షణను అందిస్తూ, గోల్డ్‌మెడల్ సాధించేందుకు కృషి చేసిన కోచ్ కేపీ.హన్మంత్‌ను, విద్యార్థులను స్కూల్ యాజమాన్యం అభినందించారు. తన్మయి, యశ్వంత్, మిదా, మన్విత, సాతిక్, దేవిరాజ్ గోల్డ్ మెడల్ సాధించారు.



కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లో కుట్టు మిషన్ ట్రైనింగ్ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

సమాజానికి మార్గనిర్దేశం చేసే రచనలు రావాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ముగిసిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మార్గనిర్దేశం చేసేలా మేధావులు, విద్యావంతులు రచనలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. భిన్న భావజాలాలు, విభిన్న దృక్పథాలకు సంబంధించిన పుస్తకాలన్నీ ఒకచోట ఉండటం, పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలో 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా తాను ప్రత్యేక చొరవ తీసుకుంటాన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత మరుగుదొడ్లు నిర్మిస్తామని వాగ్దానం చేశారు. పిల్లలకు పుస్తక పఠనాభిరుచిని పరిచయం చేసే విధంగా తల్లిదండ్రులు ప్రయత్నించాలని సూచించారు. ఆలోచనలను విస్తృతం చేసుకోవాలన్నా, సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నా పుస్తకమే ఆధారమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా, వ్యక్తిత్వాన్ని మలచుకోవడానికి పుస్తకాలను ఆశ్రయించాలని హితవుపలికారు. సామాజిక మార్పునకు దోహదపడంతోపాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించే దిశగా రచనలు చేయడం కవులు, రచయితల బాధ్యత అని అన్నారు. వర్తమానాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్తుకు బాట చూపే ఆశావాహ రచనలు రావాలని ఆకాంక్షించారు.

ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్రలను వక్రీకరిస్తున్న ప్రస్తుత సందర్భంలో వాస్తవాలు పునాదిగా లిఖించబడిన చరిత్ర పుస్తకాలు చదివి అబద్ధాల చరిత్రను తిప్పికొట్టాలని పాఠకులకు సూచించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన మాట్లాడుతూ.. సమాజంలో ట్రాన్స్ వ్యక్తుల పట్ల ఉన్న వివక్షకు వ్యతిరేకంగా తమ జీవితాలు ఇతివృత్తంగా మరిన్ని రచనలు రావాలని, అందుకు రచయితలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రముఖ కవి కె. శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని చూపించింది, పరిచయం చేసిందీ పుస్తకమే అని అన్నారు. ఓయూ వీసీ రవీందర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కవి యాకూబ్, మలుపు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ అధ్యక్షుడిది పురుషాహంకార ధోరణి

- సభను జరగనీయలేదని స్త్రీవాద రచయిత్రుల ఆగ్రహం
- నిరసనగా స్టాల్ వద్ద ప్రత్యేక సమావేశం
- ట్రాన్స్ మహిళను పిలిచి అవమానించారని విమర్శలు
- అధ్యక్షుడి తీరు సరికాదన్న సామాజిక ఉద్యమకారులు



మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బుక్ ఫెయిర్ అధ్యక్షుడి పురుషాహంకార ధోరణికి నిదర్శనం స్త్రీ వాద రచయిత్రుల సభను జరగనీయకపోవడం అంటూ రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు నిరసించారు. అధ్యక్షుడి తీరును వ్యతిరేకిస్తూ సోమవారం స్టాల్ నెంబరు 205 వద్ద రచయిత్రి సజయ నేతృత్వంలో స్త్రీవాద రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు పలువురు సమావేశం నిర్వహించారు. భిన్న నేపథ్యాలకు చెందిన రచయిత్రులతో 'స్త్రీ వాద రచయిత్రులు - వర్తమాన సవాళ్ళ' అంశంపై ఆదివారం తాము నిర్వహించ తలబెట్టిన చర్చాగోష్ఠిని సమయం లేదంటూ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు అడ్డుకున్నారని పలువురు రచయిత్రులు, సామాజిక కార్యకర్తలు విమర్శించారు. ఇది మహిళల పట్ల వారికున్న వివక్షకు నిదర్శనమని అన్నారు. బుక్ ఫెయిర్ నిర్వహణ కమిటీలో మహిళల భాగస్వామ్యం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన, ఓ వైపు చెత్త సేకరిస్తూ, డిగ్రీ చదువుతున్న వర్ధమాన రచయిత్రి జయలక్ష్మి, ఒంటరి స్త్రీలపై కథా సంపుటి వెలువరించిన విజయ భండారు, సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ రచనలు చేస్తోన్న పూర్ణిమ తమ్మిరెడ్డి, విప్లవోద్యమంలోని మహిళల కథలను సంకలనం చేసిన అనూరాధ, అపర్ణ తోట, మెర్సీ మార్గరెట్, సాత్విక నన్నెబోయిన, దాసోజు లలిత తదితరులు చర్చా గోష్ఠిలో మాట్లాడాలి అనుకున్న అంశాలను ప్రస్తావించారు. స్త్రీల రచనలకు సంబంధించిన సమావేశాన్ని చివరి నిమిషంలో రద్దు చేయడం అన్యాయమని ఆక్షేపించారు. వీరికి సంఘీభావంగా విజయ్ వంగలపూడి, ఆర్. భరద్వాజ తదితరులు మాట్లాడారు.

వేదికపై వాగ్వివాదం

'స్త్రీవాద రచయిత్రులు వర్తమాన సవాళ్లు' సదస్సును చివరి నిమిషంలో రద్దు చేసి విమర్శల పాలైన బుక్ ఫెయిర్ నిర్వాహకులు, ఆ పొరపాటును సరిదిద్దుకొనేందుకు ట్రాన్స్ మహిళా రచయిత్రి, ఉద్యమకారిణి రచన ముద్రబోయినను ముగింపు సమావేశానికి ఆహ్వానించారు. రచనతో మాట్లాడించాలని కార్యనిర్వాహక సభ్యుడు బాల్‌రెడ్డి సూచించగా.. ఎవర్ని అడిగి ఆమెను పిలిచారంటూ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మండిపడ్డారు. ఈ విషయంలో వేదికపై మంత్రి పొన్న ప్రభాకర్ సమక్షంలో వాగ్వివాదం జరిగింది. మంత్రి జోక్యం చేసుకొని రచన ముద్రబోయినతో మాట్లాడించాలని సభాధ్యక్షుడిని ఆదేశించగా.. గొడవ సద్దుమణిగింది. స్త్రీవాద రచయిత్రుల సదస్సు చివరి నిమిషంలో రద్దవడంపట్ల బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోసారి జరగనీయబోమన్నారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.7,937 కోట్లు

- ప్రస్తుతంతో పోలిస్తే రూ.1,713 కోట్లు అధికం
- నేడు కౌన్సిల్‌లో చర్చ
- ఆమోదం అనంతరం ప్రభుత్వానికి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ బడ్జెట్ భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన బడ్జెట్‌తో పోలిస్తే 2024-25 పద్దును రూ.1,713 కోట్లు పెంచుతూ.. రూ.7,937 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారు. 2023-24 సవరణ బడ్జెట్ మాత్రం రూ.6,990 కోట్లుగా చూపారు. మొదటిసారి జీహెచ్ఎంసీ చేసిన అప్పులకు సంబంధించిన వాయిదాలు, వడ్డీలకోసం రూ.1200 కోట్లు ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నారు. బడ్జెట్ పెరుగుదలకు ఇది ప్రధాన కారణం కాగా.. మ్యుటేషన్ రుసుము ప్రస్తుతం రూ.10 కోట్లు ఉండగా దానిని రూ.200 కోట్లకు పెంచారు. ప్రభుత్వం నుంచి ఇతర రూపాల్లో వచ్చే ఆదాయమూ రూ.300 కోట్లకుపైగా పెరుగుతుందని ప్రతిపాదనల్లో చూపించారు. ఆస్తిపన్ను, పట్టణ ప్రణాళికా విభాగాల ఆదాయం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ), కాంప్రహెన్సీవ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ)ల కోసం రూ.6,500 కోట్లకుపైగా అప్పు చేసిన నేపథ్యంలో ఆ రుణానికి ప్రతినెలా వడ్డీ, అసలు కలిపి నెలకు రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాస్తవంగా ఆయా పనులు ప్రభుత్వం చేయాల్సి ఉండడం.. గత సర్కారు ఆదేశాల మేరకు అప్పు తీసుకొని చేసిన దృష్ట్యా.. ఆ మొత్తం ప్రభుత్వం ఇవ్వాలనే బడ్జెట్‌లో ప్రతిపాదించినట్టు ఓ అధికారి చెప్పారు.నేడు జరుగనున్న సమావేశంలో మొదటి సెషన్‌లో ప్రశ్నోత్తరాలపై, రెండో సెషన్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఆమోదం అనంతరం పద్దును ప్రభుత్వానికి పంపనున్నారు.

బడ్జెట్ సంక్షిప్త స్వరూపం..

రెవెన్యూ ఆదాయం(రూ.కోట్లలో)..

- ఆస్తిపన్ను - రూ.1907 కోట్లు
- టౌన్‌ప్లానింగ్ - 1600
- ప్రభుత్వం నుంచి - 785
- మ్యుటేషన్ రుసుము - 200
- ట్రేడ్ లైసెన్స్ - 110
- ప్రకటనలు - 20
- ఎస్టేట్ - 10
- రుణ చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు - 1200
- ఇతరత్రా- 106

మొత్తం- 5938

మూలధన ఆదాయం (రూ.కోట్లలో)...

- 15వ ఫైనాన్స్ కమిషన్ - 350
- టీడీఆర్ - 300
- ఇతర గ్రాంట్లు - 11
- డిపాజిట్ వర్క్ రశీదులు - 8
- ఇతరత్రా రశీదులు - 2
- రుణం- 128
- ప్రభుత్వం నుంచి గ్రాంట్లు - 1200

మొత్తం- 1999

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- రూ. 4.5 లక్షల నగదు స్వాధీనం

దుండిగల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మేకలు, గొర్రెలను దొంగిలిస్తూ లక్షల రూపాయాలు సంపాదిస్తున్న నలుగురు ముఠా సభ్యులను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నాడు. వీరినుంచి 4.5లక్షల రూపాయాల నగదు, తుఫాన్ వాహనం స్వాధీనం చేసున్నారు. మేడ్చల్ డీసీపీ నిఖికా పంత్ ఐపీఎస్, ఏసీపీ సిహెచ్.శంకర్‌రెడ్డి, సిఐ.శంకర్‌రావులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డిజిల్లా, జరసంఘం మండలం, చీలేపల్లితాండాకు చెందిన పాతనేరస్తుడు రాథోడ్‌రాజు(45), రాథోడ్ సీతారం(26), బానోత్‌శివాజీ(51), రాథోడ్‌రాజేష్(50), రాములు ఒక ముఠాగా ఏర్పడి ఊరికి దూరంగా ఉన్న మేకలు, గొర్రెల దొడ్లను టార్గెట్ చేసుకుని 2023 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సోమవారం ఉదయం 7గంటల సమయంలో బౌరంపేట్ సర్వీస్‌రోడ్డులో అనుమానస్పదంగా తుఫాన్ వాహనంలో తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా మేకలు, గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. రాములు అనేవ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేపీహెచ్‌బీ మెయిన్‌రోడ్డుపై కారులో మంటలు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేపి.హెచ్‌బీ ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కేపి.హెచ్.బీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని రహదారిపై వెళ్తున్న కారులో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ కారును పక్కకు ఆపడంతో లోపల ఉన్నవారు దిగిపోయారు. కారులో మంటలు రావడంతో భయాందోళనకు గురైన స్థానికులు వాహనదారులు అక్కడి నుంచి పరుగులు తీశారు. మరికొందరు స్థానికులు కారు బానెట్ లేపి దానిలో మట్టి పోసి మంటలను అదుపులోకి తీసుకొని వచ్చి కారును పక్కకు నెట్టారు. దీంతో జేఎన్టీయూ నుంచి కేపీహెచ్‌బీకి వెళ్లే ప్రధాన రహదారి పై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



సాయికృష్ణ (ఫైల్)

రాయదుర్గం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందిన సంఘటన సోమవారం గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన ఆకుల సాయికృష్ణ(26) గచ్చిబౌలిలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం డీఎల్ఎఫ్ నుంచి గచ్చిబౌలి వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక వస్తున్న ఆర్టీసీబస్సు ఢీకొట్టడంతో సాయికృష్ణ బస్సువెనుక చక్రాల కిందపడి తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజావాణికి 41 ఫిర్యాదులు

కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో వేర్వేరుగా ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధిలోని ఐదు సర్కిళ్ల నుంచి 29 ఫిర్యాదులు అందాయి. మూసాపేట సర్కిల్ నుంచి 0, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్ 9, గాజులరామారం 3, అల్వాల్ 4, జోనల్ కార్యాలయానికి సంబంధించినవి 12 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం 9 ఫిర్యాదులు అందాయి. అలాగే గాజులరామారం సర్కిల్‌కుగాను మొత్తం 3 ఫిర్యాదులు అందగా వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి 2, యూబీడీకి ఒక్క ఫిర్యాదు ఉన్నాయి. ఈ కార్యక్రమాల్లో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహా, ఎల్‌పీ. మల్లయ్య, ఏఎంసీలు ఉదయ్‌కుమార్, కృష్ణ, డీసీపీలు సాయిబాబా, సంతోష్‌కుమార్, ఏఎంఓహెచ్ భార్గవ నారాయణ, ఈఈ కృష్ణచైతన్య, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్లకు చెందిన అన్నీ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



శివాజీ జయంతి కార్యక్రమంలో రవికుమార్‌యాదవ్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నేతలు



కూకట్‌పల్లి దీనబంధుకాలనీలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఘనంగా ఎమ్మెల్యే కృష్ణారావు జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పుట్టినరోజు సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నర్సింహ్మాయాదవ్



ఫతేనగర్‌లో ఎమ్మెల్యే కృష్ణారావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న పీహెచ్ భద్రారెడ్డి, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్ఎస్ ఆందోళన



జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్స్, ఫ్లెక్సీలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. మూసాపేటలోని జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు బైఠాయించి అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్లెక్సీలు తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ కమిషనర్, ఉపకమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో కార్పొరేటర్ గంగారెడ్డి తదితరులు

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

రాయదుర్గం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి గ్రామంలో శ్రీనాభిశిల బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోచయ్య, రవీందర్‌ప్రసాద్‌దూబే, చంద్రమౌళి, నరసింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



భవానిపురంలో పర్యటిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

భవానిపురం సమస్యల పరిష్కారానికి కృషి

చందానగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ భవానిపురం కాలనీలో సోమవారం శేరిలింగంపల్లినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ పర్యటించారు. స్థానికంగా ఉన్న నాలా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు

జీడిమెట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి హాజరై తిరిగి ఇంటికి కారులో వస్తోన్న ఓ కుటుంబం సోమవారం తెల్లవారుజామున గాజులరామారం ఉషాముళ్లపూడి ఆసుపత్రి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనలో ఇంటి పెద్ద మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని హుటాహుటిన షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి జగద్గిరిగుట్ట పోలీసులు చికిత్స చేయిస్తున్నారు. సిఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం ప్రాంతంలోని ప్రకాశంపంతులు నగర్‌కు చెందిన ఎనుగండ్ల యాదగిరి (56) స్థానికంగా బార్బర్ షాపు నిర్వహిస్తున్నాడు. కొత్తగూడెంలో రెండు రోజుల క్రితం జరిగిన బంధువుల ఇంట్లో వివాహానికి భార్య ఉమా (45), పెద్దకుమారుడు హేమంత్ (30), కోడలు పూజా (26)లు కలిసి హాజరయ్యారు. తిరిగి వారు ఈనెల 18వ తేది రాత్రి రైలులో సోమవారం తెల్లవారుజామున సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. ఊబర్ క్యాబ్ తీసుకుని గాజులరామారం బయలుదేరారు. ఉదయం 5.30గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారు డ్రైవర్ వేగంగా వెళ్లి డివైడర్‌ను, విద్యుత్ పోల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న యాదగిరికి తలకు బలమైన గాయాలు అయి మృతి చెందాడు. కోడలు పూజకు రెండు కాళ్లు విరిగిపోయాయి. కుమారుడు, భార్యకు తీవ్రమైన గాయాలయ్యాయి. వారిని 108 సాయంతో షాపూర్‌నగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈకారు ప్రమాదం బాధితుల ఇంటికి అత్యంత దగ్గరలో జరిగింది. క్యాబ్ డ్రైవర్ సురేందర్ తలకు గాయమైంది. జగద్గిరిగుట్ట పోలీసులు డ్రైవర్ సురేందర్‌ను, కారును అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. యాదగిరి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి ప్రసాదం, పట్టు వస్త్రాలు అందజేస్తున్న సెవెన్‌హిల్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

వీధివ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాలలో వీధివ్యాపారులను, తోపుడుబండ్ల వారిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాలని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో వీధివ్యాపారుల ద్వారా తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ వి.నర్సింహా ఆధ్వర్యంలో టౌన్ వెండింగ్ కమిటీ (టీవీసీ) సమావేశాన్ని సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డీపీఓ హిమబిందు, పట్టణప్రణాళికా ఏసీపీ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పీజీ విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ పీజీ విద్యార్థినులతో అలూమ్ని డైరెక్టర్ అనుచితంగా మాట్లాడారంటూ సోమవారం అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట విద్యార్థులు ఆందోళన చేశారు. డైరెక్టర్‌పై తాము చేసిన ఆరోపణలకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, సదరు డైరెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.